
సాక్షి ఒడిశా

బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6.42.259లు, బంగారం 150 మిల్లీగ్రాములు, వెండి 129 గ్రాములు 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవం

రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికల ఘట్టం ముగిసింది. 3 స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

- 8లో




పూరీ - కోణార్క్ రైలు మార్గం మంజూరు

రాష్ట్ర ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పూరీ - కోణార్క్ రైలు మార్గం నిర్మాణానికి భారత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ తెలియజేశారు.

- 8లో

న్యూస్‌రీల్

కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పర్యటన రేపు



కొరాపుట్: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాష్ట్రంలో గురువారం పర్యటించనున్నారు. ఉదయం విశాఖపట్నం నుంచి ప్రత్యేక విమానంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగదల్‌పూర్ పట్టణానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రైవేటు హెలికాప్టర్‌లో ఒడిశాలోని నబరంగ్‌పూర్ పట్టణానికి ఉదయం 10.50కి విచ్చేస్తారు. ఈ సందర్భంగా మజ్జిగుడలో నబరంగ్‌పూర్ జిల్లా బీజేపీ కార్యాలయం ప్రారంభిస్తారు. అనంతరం కొరాపుట్, మల్కన్‌గిరి, రాయగడ, నబరంగ్‌పూర్, కలహండి, నువాపడా జిల్లాల పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. అక్కడ నుంచి జగదల్‌పూర్ వెళ్లి విమానంలో బ్రహ్మపూర్ సమీపంలోని రంగోయిలుండా ఎయిర్‌స్ట్రిప్‌లో 1.30కి దిగుతారు. అక్కడ నుంచి 3.30కి మయూర్‌బంజ్ జిల్లా చేరుకుని కార్యకర్తల సమావేశం నిర్వహిస్తారు. తిరిగి విమానంలో రాత్రి 7.30కి న్యూఢిల్లీ చేరుకుంటారు. రాజ్‌నాథ్ సింగ్ చివరిసారి 2014 సంవత్సరం సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా కొరాపుట్ జిల్లా కోట్‌పాడ్ వచ్చారు. తిరిగి ప్రస్తుతం పార్టీ కార్యక్రమంలో భాగంగా నబరంగ్‌పూర్ వస్తున్నారు. ఇప్పటికే కేంద్ర నిఘా ఏజెన్సీలు నబరంగ్‌పూర్ జిల్లా చేరుకున్నాయి. కార్యక్రమాలు జరిగే సమీప సర్క్యూట్ హౌస్‌ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.

గంజాయి వ్యాపారుల ముఠా అరెస్టు



పట్టుబడిన గంజాయి వ్యాపారులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ పోలీసులు ముగ్గురు అంతర్ రాష్ట్ర గంజాయి వ్యాపారుల ముఠాను మంగళవారం అరెస్టు చేశారు. అరెస్టైనవారు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కపిల్ కత్రియ(23), సౌరభ భాత్ర(23), మొనిష్ నత్రియ(19)లుగా వెల్లడించారు. ఆ ముగ్గురు బొరిపరిగుడ సమితి దొరాగుడ గ్రామంలో ఒక గంజాయి వ్యాపారి దైతారి హంతాల్ ఇంటిలో ఉండి గంజాయి దొంగతనంగా రవాణా చేసే విషయంలో ప్లాన్ వేస్తున్నారు. ఈ విషయం విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిన బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజలి ప్రధాన్ వెంటనే ఎస్‌ఐ అనితా నాయిక్ నేతృత్వంలో ఒక పోలీసు టీమ్‌ను దొరాగుడ గ్రామానికి పంపారు. ఆ టీమ్ దైతారి ఇంటిపై దాడి చేసింది. పోలీసులను చూసి దైతారి హంతాల్ పారిపోయాడు. అయితే ఇంటిలో ఉన్న ముగ్గురు రాజస్థాన్ యువకులు పోలీసులకు చిక్కారు. వారి వద్ద గంజాయి లభించలేదని, వారు తాగుతున్న మద్యం సీసాలు లభ్యమయ్యాయని పోలీసు అధికారి వెల్లడించారు. వాటిని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

అభివృద్ధి బాటలో సెంట్రల్ వర్సిటీ

- రూ.129 కోట్లు కేటాయించిన పీఎం మోదీ



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ బసంత పండా తదితరులు



ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

కొరాపుట్: జిల్లాలోని సునాబెడాలో ఉన్నటువంటి ఒడిశా సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధికి పీఎం నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారు. మంగళవారం జమ్మూ కాశ్మీర్ పర్యటనలో భాగంగా అక్కడ నుంచి వర్సిటీ అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.129 కోట్ల వ్యయంతో వర్సిటీలో నిర్మాణాలు జరుగుతాయని తెలియజేశారు. ఈ నిధులతో బోధన బ్లాక్‌లు, ఒక పరిపాలన భవనం, లైబ్రరీ, రెండు హాస్టళ్లు నిర్మిస్తారు. అభివృద్ధితో సెంట్రల్ వర్సిటీ నలందా, తక్షశిల వర్సిటీలను తలపించాలని ఆకాంక్షించారు. అనంతరం శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలహండి ఎంపీ బసంగా పండా, వీసీ చక్రధర్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో ... టిక్కెట్ల కోలాహలం..!

- మార్చి 1న తొలి జాబితా..?
- 70 మంది అభ్యర్థులను ప్రకటించే యోచన
- దరఖాస్తులపై కోర్ కమిటీ సమావేశం



పీసీసీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం అభ్యర్థుల జాబితా కసరత్తులో తలమునకలై ఉంది. ఇతర ప్రధాన రాజకీయ పక్షాల కంటే ముందుగా కాంగ్రెస్ తన అభ్యర్థుల జాబితా ప్రకటించేందుకు యోచిస్తోంది. ఈ నేపథ్యంలో మార్చి ఒకటో తేదీ నాటికి అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ జాబితాలో 70 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించనున్నట్లు సమాచారం. ఉభయ లోక్‌సభ, శాసన సభకు పోటీ చేయనున్న అభ్యర్థుల వివరాలతో తొలి జాబితా సిద్ధమవుతోంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్టుతో పోటీ చేయాలనుకున్న ఔత్సాహిక అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు దాఖలు చేయాలని అఖిల భారత కాంగ్రెసు కమిటీ(ఏఐసీసీ) ఇదివరకే ప్రకటించింది. ఈ క్రమంలో ప్రగామన్ యాప్ ద్వారా పలువురు ఔత్సాహిక అభ్యర్థులు పోటీ కోసం టిక్కెట్లు అభ్యర్థించారు. ఔత్సాహిక అభ్యర్థుల్ని ఖరారు చేసేందుకు ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) మంగళవారం సమావేశం అయింది. ఈ సమావేశానికి 23 మంది సభ్యులు హాజరయ్యారు. లోక్‌సభ, శాసన సభ స్థానాలకు వచ్చిన దరఖాస్తులపై విస్తృత చర్చతో టిక్కెట్ల పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పీఈసీ ఖరారు చేసిన జాబితాను ఢిల్లీలోని స్క్రీనింగ్ కమిటీకి సిఫారసు చేస్తారు. ఈ సమాచారం ఆధారంగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తుది నిర్ణయం తీసుకుంటుందని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ సమావేశానికి ముందు మీడియా ప్రతినిధులతో అన్నారు.

పారదర్శకంగా టిక్కెట్లు

ఈ నెల ప్రారంభంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి డాక్టర్ అజయ్ కుమార్ అభ్యర్థులకు పారదర్శకంగా టిక్కెట్ల పంపిణీ కోసం ప్రాజెక్ట్ ప్రగామన్ ప్రారంభించినట్లు తెలిపారు. పోటీ కోసం ఈ మాధ్యమంలో దరఖాస్తు దాఖలు చేసేందుకు ఈనెల 4 నుంచి 11వ తేదీ వరకు గడువు కల్పించారు. నిజాయితీ, పార్టీపై అంకితభావం కలిగిన కాంగ్రెస్ కార్యకర్తలకు పోటీ చేసేందుకు టిక్కెట్టు కేటాయించడంలో పూర్తి పారదర్శకత అవలంభనకు ఈ చొరవ దోహదపడుతుందని వివరించారు. దీంతో లాబీ, వంశపారపర్యం వంటి పరిస్థితులకు అవకాశం లేకుండా అర్హులైన వారికి టిక్కెట్లు లభిస్తాయన్నారు.

3,300ల దరఖాస్తులు

కొత్తగా ప్రవేశపెట్టిన ప్రగామన్ ఆధ్వర్యంలో రాష్ట్ర యూనిట్‌కు 3,300 పైబడి ఆన్‌లైన్ దరఖాస్తులు అందాయని శరత్ పట్నాయక్ తెలియజేశారు. రాష్ట్రంలో 147 అసెంబ్లీ స్థానాలకు 2,500 మందికి పైగా అభ్యర్థులు, 21 లోక్‌సభ టిక్కెట్ల కోసం 670 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలోని 147 అసెంబ్లీ స్థానాల్లో 9, 21 లోక్‌సభ స్థానాల్లో ఒకదానిని మాత్రమే కాంగ్రెస్ గెలుచుకుంది. సరికొత్త ప్రామాణికాలతో ఖరారు అవుతున్న అభ్యర్థులతో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి ఫలితాలు సాధిస్తుందో వేచి చూడాల్సిందే.

కోర్ కమిటీ ఏర్పాటు

ఆన్‌లైన్‌లో కాంగ్రెస్ టిక్కెట్టు కోసం అభ్యర్థించిన వారి నుంచి తగిన అభ్యర్థులను ఖరారు చేసేందుకు ప్రత్యేకంగా కోర్ కమిటీ ఏర్పాటు చేసినట్లు శరత్ పట్నాయక్ తెలిపారు. ఈ కమిటీలో 7 మంది సభ్యులు ఉంటారు. వీరిలో ముగ్గురు ఓపీసీసీ మాజీ అధ్యక్షులు, ప్రచార కమిటీ అధ్యక్షుడు, మహిళా కాంగ్రెసు అధ్యక్షురాలు, పీసీసీ అధ్యక్షుడు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఖరారు చేసిన జాబితా స్క్రీనింగ్ కమిటీకి సిఫారసు చేస్తుంది.

గెలుపు గుర్రాలకే అవకాశం

తరచూ ఓటమి చవిచూసిన అభ్యర్థులకు ఈసారి టిక్కెట్టు కేటాయించే అవకాశం లేనట్లు తెలుస్తోంది. కోర్ కమిటీ 3 మంది అభ్యర్థుల జాబితాని స్క్రీనింగ్ కమిటీకి సిఫారసు చేస్తుంది. వీరిలో ఇద్దరి పేర్లని అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి సిఫారసు చేస్తారు. వీరి నుంచి ఒకరిని ఏఐసీసీ ఖరారు చేసిన అభ్యర్థికి టిక్కెట్టు లభిస్తుంది.

యువత, మహిళలకు ప్రాధాన్యం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెసు యువతరం, మహిళలకు పట్టం గట్టేందుకు యోచిస్తోంది. తొలి విడత కింద 70 మంది అభ్యర్థుల జాబితాని జారీ చేసేందుకు కసరత్తు జరుగుతోంది. ఈ జాబితాలో 10 మంది లోక్‌సభ అభ్యర్థులు మిగిలిన వారంతా శాసనసభ స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థించిన వారు ఉంటారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

అక్రమంగా వాహనానికి చలానా

- కోర్టులో కేసు వేసిన బాధితుడు



ఫిర్యాదు చేసిన రమేష్ చంద్ర త్రిపాఠీ

జయపురం: నారాయణపట్న పోలీసులు అక్రమంగా తన వాహనానికి చలానా విధించడంతో జయపురానికి చెందిన 75 ఏళ్ల వృద్ధుడు రమేష్ చంద్ర త్రిపాఠీ జయపురం కోర్టులో మంగళవారం కేసు వేశారు. నిబంధనలకు విరుద్ధంగా తన వాహనానికి చలానా నమోదు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీన నారాయణపట్న నుంచి వస్తున్న సమయంలో తమ కారుని పోలీసులు తనికీ చేసినట్లు వివరించారు. అయితే ఆ సమయంలో ముందు సీట్‌లో కూర్చున్న ఇద్దరు సీట్ బెల్ట్ పెట్టుకోవడంతో పోలీసులు వెళ్లిపోమన్నారని తెలిపారు. కానీ కొద్ది సమయం తర్వాత సీట్ బెల్ట్ పెట్టుకోలేదనే కారణంగా చూపుతూ కారుపై రూ.1,000 చలానా విధించినట్లు మెసేజ్ వచ్చిందన్నారు. దీంతో అనుమానం వచ్చి విచారించగా శుక్ర మాఢి అనే ఎస్‌ఐ ఐడితో చలానా వేసినట్లు తేలిందన్నారు. అయితే ఆ అధికారితో సంప్రదించగా అతడు ఈనెల 1వ తేదీనే కోట్‌పాడ్ పోలీసుస్టేషన్‌కు బదిలీ అయినట్లు తెలిసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తమ టార్గెట్లు పూర్తి చేసుకునేందుకు నింబంధనలు తుంగలో తొక్కుతూ అక్రమంగా చలానాలు విధిస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి ఘటనలు మరోసారి పునరావృతం అవ్వకుండా కొరాపుట్ జిల్లా ఎస్పీ, లక్ష్మీపూర్ పోలీసు అధికారి, నారాయణపట్న పోలీసు అధికారి, ఎస్‌ఐ శుక్ర మాఢి, కొరాపుట్ ట్రాన్స్‌పోర్టు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గుణుపూర్ టిక్కెట్టు ఎవరికో..!

- అధికార బీజేడీలో అయోమయం
- సిట్టింగ్ ఎమ్మెల్యేపై పార్టీ నాయకుల్లో అసంతృప్తి
- టిక్కెట్టు రేసులో రమాకాంత్ మాఝి
- సమాలోచనల్లో అధిష్టానం



ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో



రమాకాంత్ మాఝి

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగోకు మరోసారి బీజేడీ అధిష్టానం టిక్కెట్టు కేటాయిస్తుందో లేదోననే చర్చలు వాడీవేడిగా సాగుతున్నాయి. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 6,270 ఓట్ల మెజారిటీతో సమీప కాంగ్రెస్ అభ్యర్థి పురుషోత్తం గొమాంగోపై రఘునాథ్ గొమాంగో విజయం సాధించారు. అనంతరం ఎమ్మెల్యే పగ్గాలు చేపట్టి అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. అయితే కొద్దికాలంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో దూరంగా ఉంటున్నారు. దీంతో ఎమ్మెల్యే తమను పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత బీజేడీ నాయకులు బహిరంగంగా చెప్పుకునేవారు.

పంచాయతీ ఎన్నికల్లో ఎదురుదెబ్బ

ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో గుణుపూర్‌లో బీజేడీకి ఎదురుదెబ్బ తగిలింది. ఒక పైపు పంచాయతీ ఎన్నికల్లో అధిక స్థానాలను సంపాదించుకోకపోవడమే కాకుండా, గుణుపూర్ మున్సిపాలిటీని సైతం బీజేడీ కోల్పోయింది. స్వతంత్ర అభ్యర్థులుగా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన మమత గాడో, ఆమె భర్త శివ గాడోలు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లుగా విజయం సాధించారు. ఎమ్మెల్యే సొంత నియోజకవర్గంలో బీజేడీ పరాభవం వెనుక ఎమ్మెల్యే గొమాంగో పాత్ర చాలా కీలకమని పరిశీలకులు విమర్శించారు. కార్యకర్తలు, నాయకులతో సత్సంబంధాలు అంతగా లేకపోవడమే బీజేడీ ఉనికి కోల్పోవడానికి కారణమని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గుణుపూర్ నుంచి పోటీచేసే అభ్యర్థిపై ఆసక్తి నెలకొంది. ఎన్నికల్లో పోటీకి రఘునాథ్ గొమాంగో మళ్లీ సిద్ధం అవుతుండగా, అదే స్థానం నుంచి పోటీ చేసేందుకు పద్మపూర్ సమితి మాజీ అధ్యక్షుడు రమాకాంత్ మాఝి టిక్కెట్టు రేసులో ఉన్నారు. గొమాంగోపై అసంతృప్తి గల నాయకులు మాఝికి టిక్కెట్టు కోసం అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేకు కాదని వేరొకరికి టిక్కెట్టు మంజూరు చేస్తే పరిస్థితి ఎలా ఉండబోతుందోనని అధిష్టానం సమాలోచనలో పడిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ ఈ స్థానాన్ని వరుసగా మూడుసార్లు కైవసం చేసుకున్న బీజేడీ ఈసారి ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఏమాత్రం తేడా జరిగినా ఈసారి ఎమ్మెల్యే స్థానం కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. మరి ఇటువంటి పరిస్థితిలో అధిష్టానం ఎవరికి టిక్కెట్టు మంజూరు చేస్తుందో వేచి చూడాల్సిందే.

బైక్ దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు



పోలీసులకు చిక్కిన నిందితులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీసులు ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరిని సోమవారం రాత్రి అరెస్టు చేశారు. సమితిలోని కుచేయిపొదొరొ గ్రామానికి చెందిన టెండుల్కర్ మాఝి అనే యువకుడు తన బైకు దొంగతనానికి గురయ్యిందని టికిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సమితిలోని కనొపాడి గ్రామానికి చెందిన ప్రపుల్ల మినియాక(28), పదశంకుడి గ్రామానికి చెందిన ప్రసాద్ హికలను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు.

జీవికా మిషన్ పథకం ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న గిరిజన కళాకారులు

చెక్కు అందజేస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తదితరులు

పర్లాకిమిడి: రాష్ట్ర ప్రభుత్వం గజపతి జిల్లాలో ముఖ్యమంత్రి జనజాతి (ఎస్టీ) జీవికా మిషన్ పథకం అమలు చేసింది. స్థానిక బిజూ కల్యాణ మండపంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ ముఖ్య అతిథిగా విచ్చేసి పథకాన్ని మంగళవారం ప్రారంభించారు అంతుకుముందు జిల్లాలోని ఐదు వెనుకబడిన సమితిల నుంచి గిరిజనులు పెద్ద ఎత్తున సాంప్రదాయ నృత్యాలతో బిజూ కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా ఐటీడీఏ పరిధిలో 143 క్లస్టర్స్ ద్వారా ఎంపికైన గిరిజన యువతీ యువకులు వివిధ కుటీర పరిశ్రమలు, పండ్ల తోటలు, తేనె అమ్మకాలు చేస్తున్న యువ పారిశ్రామికవేత్తలు లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి శాఖ అధికారి ఫాల్గుణీ మఝి, స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ మరియం రైయితో, సీసీడీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అడ్డాల జగన్నాథ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సార్వణ్ వివేక్



అరెస్టైన ముగ్గురు నిందితులు



స్వాధీనం చేసుకున్న పాస్‌పోర్టులు, వీసాలు

బరంపురం: కెన్యాలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి ఒక వ్యక్తిని మోసం చేసిన ముగ్గురు నిందితులను గుసానినువాగం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ తెలిపిన వివరాల మేరకు.. గంజాం జిల్లాలోని కళ్లికోట్‌కి చెందిన బాధితుడు ప్రభాత్ ప్రధాన్ ఈనెల 4వ తేదీన గుసానినువాగం పోలీసుస్టేషన్‌లో ఉద్యోగం కోసం డబ్బులు చెల్లించి తాను మోసపోయినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నగరంలో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారిలో విశాఖపట్నంకు చెందిన డి.మోహన్ రెడ్డి, శ్రీకాకుళం జిల్లాకి చెందిన పి.సింహాచలం, పి.ఢిల్లేశ్వర్ రెడ్డిలు ఉన్నట్లు నిర్ధారించారు. అరెస్టైనవారి దగ్గర నుంచి 92 పాస్‌పోర్టులు, 20 పర్యాటక వీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరిచి, బరంపురం సర్కిల్ జైలుకి తరలించారు.

వంతెనల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

- రూ.91.41 కోట్ల నిధులు మంజూరు
- రేపటి నుంచి టెండర్ల ప్రక్రియ



వంశధార నది

రాయగడ: జిల్లాలో గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోని వంశధార, మహేంద్రతనయ నదులపై మూడు వంతెనలు నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు వీటి నిర్మాణానికి సంబంధించి రూ.91.41 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ వంతెనల నిర్మాణ బాధ్యతను గ్రామీణాభివృద్ధి సంస్థ చేపట్టనుంది. ఈనెల 22 నుంచి టెండర్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. గుణుపూర్ పట్టణంలోని తొలొముండ, గడియాకల్ నుంచి పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జగన్నాథపురానికి అనుసంధానించే విధంగా వంశధార నదిపై సుమారు 650 మీటర్ల పొడవున వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.49,90,57,000 నిధులను కేటాయించింది. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే సుమారు 19 గ్రామాలకు చెందిన ప్రజల రాకపోకలకు మార్గం సుగమమవుతుంది. అదేవిధంగా సబ్ డివిజన్‌లోని రామనగుడ సమితి శుభద్రపూర్ నుంచి బఘొశొలాంకొ అనుసంధానించే విధంగా వంశధార నదిపై సుమారు 300 మీటర్ల పొడవున వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.25,43,14,000 కేటాయించింది. ఈ వంతెన నిర్మాణం పనులు పూర్తయితే 14 గ్రామాలకు రాకపోకలకు మార్గం సుగమమవుతుంది. అలాగే గుడారి సమితి సనొహుమా నుంచి బొడొహుమా మధ్య గల మహేంద్రతనయ నదిపై సుమారు 300 మీటర్ల పొడవున వంతెన నిర్మాణం కోసం రూ.26,7,79,000 నిధులు సమకూర్చింది. ఈ వంతెన నిర్మాణం పనులు పూర్తయితే 6 గ్రామాలకు చెందిన ప్రజల రాకపోకలకు వీలు కలుగుతుంది. గతేడాది జూన్ నెలలో రాష్ట్ర 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ ఈ ప్రాంతంలో పర్యటించిన సమయంలో ప్రజల వంతెనల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై సమీక్షించిన ప్రభుత్వం ఈ మేరకు నిధులు మంజూరు చేసింది.

క్లుప్తంగా

ఉత్తమ మత్స్యకారుడిగా చక్రధర్


అవార్డుతో చక్రధర్ పట్నాయక్

మల్కన్‌గిరి: జిల్లాలో చేపల పెంపకంలో ఉత్తమ మత్స్యకారుడిగా యువ చేపల రైతు చక్రధర్ పట్నాయక్‌కు అవార్డు లభించింది. అతడికి రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో మత్స్యశాఖ అధికారులు అవార్డును అందజేశారు. ఇప్పటికే పలుమార్లు చక్రధర్‌కు జిల్లా స్థాయి అవార్డులు లభించాయి. తన సొంత పొలంలోనే చేపలు చెరువు వేసి చేపలను పెంపకం చేపడుతున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేపల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిస్తోందని తెలిపినట్లు వెల్లడించారు.

పిచ్చికుక్క దాడిలో 15 మేకలు మృతి


మృతి చెందిన మేక పిల్లలు

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీసుస్టేషన్ పరిధి భుజబల్ గ్రామంలో ఒక పిచ్చికుక్క దాడి చేసిన ఘటనలో 15 మేక పిల్లలు మృతి చెందాయి. మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. భుజబల్ గ్రామానికి చెందిన జితేంద్ర చింతాడ అనే వ్యక్తికి సంబంధించిన మేక పిల్లలను అతని ఇంటి ముందు ఉన్నటువంటి షెడ్డులో ఉంచాడు. దీంతో పిచ్చికుక్క షెడ్డులోకి దూరి మేక పిల్లలపై దాడిచేసింది. మేక పిల్లల అరుపులకు ఇంటి నుంచి బయటకు వచ్చిన జితేంద్ర షెడ్డు లోపలికి వెళ్లిన కుక్కను తరిమికొట్టాడు. అయితే అప్పటికే మేక పిల్లలు మృతి చెందాయి. దీంతో తనకు ప్రభుత్వం పరిహారం అందజేయాలని బాధితుడు కోరుతున్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరవధిక సమ్మె


సమ్మెలో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు

రాయగడ: రెవెన్యూ ఉద్యోగులు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. రెవెన్యూ సూపర్‌వైజర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల రిక్రూట్‌మెంట్ కేడర్‌లను పునర్ వ్యవస్థీకరణ చేయాలన్న ప్రధాన డిమాండ్లతో ఆందోళన చేపడుతున్నట్లు ఒడిశా రెవెన్యూ ఉద్యోగుల సంఘం తెలియజేసింది. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. సమ్మె ఫలితంగా పనులు నిలిచిపోయాయి. తమ డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించేవరకు సమ్మె కొనసాగుతుందని సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ రథ్ స్పష్టం చేశారు.

మల్కన్‌గిరి చేరుకున్న పాదయాత్ర


పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి జాన్‌బాయి నుంచి సీపీఐ నేతలు చేపడుతున్న పాదయాత్ర మల్కన్‌గిరికి మంగళవారం చేరుకుంది. దీనిలో భాగంగా స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి అలీ కిషోర్ పట్నాయక్ మాట్లాడుతూ.. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. ఉపాధి హామీ పనులు రైతులకు మేలు జరిగేలా చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సీపీఐ కార్యదర్శి బ్రోజా మాఝి తదితరులు పాల్గొన్నారు.

'హామీలు అమలు చేయాలి'

రాయగడ: నిరుపేద కుటుంబాలకు ఉజ్వల గ్యాస్ సిలిండర్ పథకంలో భాగంగా లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు సక్రమంగా అందేలా చూసే బాధ్యత ఉజ్వల దీదీలకు కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ నేపథ్యంలో ప్రతీ నెలకు సుమారు రూ.10 వేల వేతనం ఇస్తామని కేంద్రం ప్రకటించింది. అయితే ప్రస్తుతం వేతనం అందించడం లేదని ఉజ్వల దీదీలు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసనను తెలిపి ప్రధానమంత్రి, రాష్ట్రపతిల పేరిట ఒక వినతిపత్రంను ఏడీఎం భాస్కరరైతాకు అందజేశారు. అంతకుముందు స్థానిక సమితి కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నారు. హామీ అమలు చేయకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బీనాపాణి బెహర హెచ్చరించారు. కార్యక్రమంలో భారతీయ మజ్దూర్ సంఘ్‌కు చెందిన జోగేశ్వర్ దాస్, గణేష్ కుమార్ సాహు తదితరులు తమ మద్దతును ప్రకటించారు.

రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవం

• ధ్రువీకరణ పత్రాలు అందజేత

భువనేశ్వర్: రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికల ఘట్టం ముగిసింది. రాష్ట్రం నుంచి ఖాళీ అయిన 3 స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. కేంద్ర రైల్వేశాఖ మంత్రి, భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అశ్విని వైష్ణవ్, బిజు జనతాదళ్ అభ్యర్థులు దేబాశిష్ సామంతరాయ్, సుభాశిష్ ఖుంటియాలు మంగళవారం రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒడిశా నుంచి మూడు స్థానాలకు ముగ్గురు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

ఉపసంహరణ గడువు పూర్తి

పోటీలో నుంచి అభ్యర్థులు వైదొలిగేందుకు మంగళవారంతో గడువు ముగిసింది. దీంతో ముగ్గురినీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారి వీరికి సర్టిఫికెట్లను అందజేశారు. కటక్ బరాబటి మాజీ ఎమ్మెల్యే దేబాశిష్ సామంతరాయ్, బిజు యువ జనతా దళ్ (బీవైజేడీ) ఉపాధ్యక్షుడు సుభాశిష్ ఖుంటియాలు అధికార బీజేడీ తరఫున 2 రాజ్యసభ స్థానాలకు తమ నామినేషన్లు దాఖలు చేశారు. రాజ్యసభ మూడో స్థానానికి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా అశ్విని వైష్ణవ్ తన పత్రాలను దాఖలు చేశారు. ఎన్నికల్లో ఆయనకు


రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా ధ్రువపత్రం అందుకుంటున్న అశ్విని వైష్ణవ్


ధ్రువపత్రం అందుకుంటున్న దేబాశిష్ సామంత్రాయ్


ధ్రువపత్రం అందుకుంటున్న సుభాసిస్ ఖుంటియా

మద్దతు ఇస్తామని బీజేడీ గతంలోనే ప్రకటించింది. 2019లో మొదటిసారి రాజ్యసభకు పోటీ చేసిన మాజీ ఐఏఎస్ అధికారి అశ్విని వైష్ణవ్‌కు బిజు జనతా దళ్ (బీజేడీ) మద్దతు ఇవ్వడంతో వైష్ణవ్ ఒడిశా నుంచి రాజ్యసభకు తొలిసారి ఎన్నిక అయ్యారు. తాజా విజయంతో వరుసగా రెండోసారి బీజేడీ మద్దతుతో రాజ్యసభకు పట్టం గట్టింది. ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ స్థానాలనూ గెలుచుకోవడానికి అవసరమైన బలం బీజేడీకి ఉంది. రాష్ట్ర శాసనసభలో బీజేపీకి నామమాత్రంగా 22 మంది ఎమ్మెల్యేల బలం మాత్రమే ఉంది. ఈ పరిస్థితుల్లో బీజేడీ బలం కూడగట్టుకుని రాజ్యసభ ఎన్నికల్లో గట్టెక్కడం రాజకీయ చతురతకు తార్కాణంగా నిలిచింది. ఈ ఏడాది ఏప్రిల్ 3న అశ్విని వైష్ణవ్, బీజేడీ నేతలు ప్రశాంత్ నందా, అమర్ పట్నాయక్ పదవీకాలం ముగియడంతో రాజ్యసభ సభ్యుల సీట్లు ఖాళీ అవుతాయి.

పూరీ – కోణార్క్ రైలు మార్గం మంజూరు



మాట్లాడుతున్న రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్

• రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

భువనేశ్వర్: రాష్ట్ర ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న పూరీ – కోణార్క్ రైలు మార్గం నిర్మాణానికి భారత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కేంద్ర రైల్వేలు, కమ్యూనికేషన్లు మరియు ఎలక్ట్రానిక్స్, సాంకేతిక సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మంగళవారం తెలియజేశారు. ఈ ప్రాజెక్టుకు రూ.492 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. పూరీ–కోణార్క్ మధ్య 32 కిలోమీటర్ల పొడవైన రైలు మార్గ నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రాజెక్ట్ కోసం బడ్జెటులో నిధులు మంజూరైనట్లు స్పష్టం చేశారు. రైలు మార్గం నిర్మాణానికి భూమి లభించిన వెంటనే పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం సమగ్రంగా 217 ఎకరాల విస్తీర్ణపు స్థలం అవసరం ఉంటుందన్నారు. భూసేకరణ పనుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. పూరీ – కోణార్కు రైలు లైన్ ప్రారంభమైతే ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. విస్టాడోమ్ రైలు సర్వీసులు ఈ లైన్‌లో నడుస్తాయని వెల్లడించారు. రైలు మార్గంలో జగన్నాథ సంస్కృతిని ప్రోత్సహించడానికి జగన్నాథ ఆలయ పాలక వర్గం రైల్వేతో సమన్వయంగా సహకరించాల్సి ఉంటుందన్నారు.

బొరిగుమ్మను ఎన్‌ఏసీగా ప్రకటించాలి

• ఎమ్మెల్యే తారాప్రసాద్ డిమాండ్


మాట్లాడుతున్న జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్


మాట్లాడుతున్న మాజీ మంత్రి రబినారాయణ నందో

జయపురం: బొరిగుమ్మను ఎన్ఏసీగా ప్రకటించాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి డిమాండ్ చేశారు. జయపురంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. బొరిగుమ్మ ఎన్ఏసీ విషయమై 2015 నుంచి ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలియజేశారు. దీనికోసం అసెంబ్లీలో అడిగిన ప్రశ్నల జాబితాను చూపించారు. ఈనెల 25వ తేదీలోగా స్పష్టమైన ప్రకటన చేయకపోతే 26వ తేదీన బొరిగుమ్మ బంద్ చేపడతామని హెచ్చరించారు. రాష్ట్రంలోనే అతిపెద్ద సమితి అయిన బొరిగుమ్మలో ఎన్ఏసీకి కావాల్సిన అన్ని వనరులు ఉన్నాయని పేర్కొన్నారు. అవిభక్త కొరాపుట్‌పై ప్రభుత్వం చూపుతున్న సవతి ప్రేమ వలన ప్రజలకు అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. దీనిపై బీజేడీ సీనియర్ నేత, మాజీ మంత్రి రబినారాయణ నందో స్పందించి ఎమ్మెల్యేపై విరుచుకుపడ్డారు. బొరిగుమ్మలో మాట్లాడుతూ.. బొరిగుమ్మ అంటే సీఎంకు ఎంతో అభిమానమని పేర్కొన్నారు. అతి త్వరలోనే బొరిగుమ్మను ఎన్ఏసీగా ప్రకటిస్తారని భరోసా ఇచ్చారు. ఈ విషయంపై ఒక టీమ్ బొరిగుమ్మ నుంచి భువనేశ్వర్ వెళ్లి 5టీ అధ్యక్షుడు వీకే పాండ్యన్‌తో చర్చించనున్నట్లు వెల్లడించారు. ఎన్ఏసీ డిమాండ్‌తో బంద్‌కు పిలుపునివ్వడం రాజకీయమని మండిపడ్డారు.

ఘాట్ రోడ్డులో స్కూల్ బస్సు బోల్తా


బోల్తాపడిన బస్సు

మల్కన్‌గిరి/జయపురం: జిల్లాలోని బోయిర్‌పూట్ సమితి గోవిందపల్లి ఘాట్ రోడ్డులో మంగళవారం స్కూల్ బస్సు బోల్తాపడింది. వివరాల్లోకి వెళ్తే.. బైపరగూడ వద్దనున్న ఇమాన్యుయేల్ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న గోవిందపల్లి గ్రామానికి చెందిన ప్యూన్ సోమవారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. దీంతో విషయం తెలిసిన పాఠశాల సిబ్బంది మంగళవారం ఉదయం స్కూల్ వ్యాన్‌లో ప్యూన్ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లారు. ఆ సమయంలో ఘాట్ రోడ్డు వద్ద బస్సు బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో పాఠశాల ప్రిన్సిపాల్ భార్య నీలిమ పండ సంఘటన స్థలంలోనే మృతి చెందింది. అలాగే 8 మందికి తీవ్రగాయాలు, 13 మందికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహన్ని బైపారగూడ ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

బీజేడీలోకి చేరికలు


రబినారాయణ నందోతో పార్టీలో చేరినవారు

జయపురం: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండడంతో బీజేడీలోకి వలసలు పెరుగుతున్నాయి. జయపురం నియోజకవర్గంలోని అంత గ్రామ పంచాయతీకి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రి రబి నారాయణ నందో ఆధ్వర్యంలో బీజేడీలో మగళవారం చేరారు. సీఎం నవీన్ పట్నాయక్ ఆశయాలు, పాలనకు ఆకర్షితమై బీజేడీలో చేరుతున్నట్లు వాళ్ల ప్రకటించారు. ఈ సందర్భంగా రబి నారాయణ మాట్లాడుతూ.. పార్టీలో చేరినవారు రానున్న ఎన్నికల్లో విజయానికి సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ ఇందిరా నందో, జయపురం సమితి బీజేడీ ఉపాధ్యక్షుడు గణేష్ ప్రసాద్ పాడీ, జిల్లా పరిషత్ సభ్యులు అస్త నాయిక్, కొరాపుట్ జిల్లా యువ బీజేడీ సాధారణ కార్యదర్శి దుర్గ మిశ్ర, మనోజ్ త్రిపాఠీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ భవనం ప్రారంభం


ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు



భవనాన్ని ప్రారంభిస్తున్న డీఆర్ఎం సౌరభ్

రాయగడ: కొత్తగా రూపుదిద్దుకుంటున్న స్థానిక రైల్వేస్టేషన్‌లో కొత్తగా నిర్మించిన ఆర్‌పీఎఫ్ పోస్టు భవనాన్ని విశాఖపట్నం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మాణ దశలో ఉన్నటువంటి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పరిశీలించారు. అదేవిధంగా వాహనాల పార్కింగ్ ప్రాంతం, స్టేషన్ బల్డింగ్ పనులను సమీక్షించారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి


పర్లాకిమిడి: వేంకటేశ్వర స్వామివారి తిరువీధి ఉత్సవం


రాయగడ: సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు


రాయగడ: పూజలందుకుంటున్న వేంకటేశ్వరుడు

రాయగడ: జిల్లావ్యాప్తంగా భీష్మ ఏకాదశి పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్థానిక బాలాజీనగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో సత్యనారాయణ వ్రత పూజలు జరిగాయి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పర్లాకిమిడి: భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని పట్టణంలోని ఆలయాల్లో వేకువజాము నుంచే పూజలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామివారి ఆలయం నుంచి స్వామివారు శ్రీదేవి, భూదేవితో మలయప్ప వాహనంలో తిరువీధి ఉత్సవంను ఆలయ ధర్మకర్తలు పైడిఘంటం కుటుంబీకులు జరిపారు. అలాగే శ్రీజగన్నాథ మందిరంలో వైభవంగా పూజలు చేపట్టారు. ఖంజావీధి త్రినాథ మందిరంలో ఏకాదశి ఉపవాసాలు, 24 గంటల భజన కార్యక్రమంను ఏర్పాటు చేశారు.

వాలీబాల్ విజేత ఖుర్దా పోలీసు జట్టు


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే ముదులి

రాయగడ: సదరు సమితి కొత్తపేటలో కొత్తపేట యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించిన ప్రథమ జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా ఖుర్దాకు చెందిన పోలీసు జట్టు నిలిచింది. ఫైనల్స్‌లో చినమేరింగితో తలపడి తేడాతో 3–0 విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముదులి మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందని పేర్కొన్నారు. కొత్తపేట వంటి ప్రాంతంలో ప్రథమంగా జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించడం అభినందించాల్సిన విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, క్రీడాకారులు వినియోగించుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేడీ సీనియర్ నాయకుడు ఎల్ల కొండబాబు, కె.శ్రీనివాస్, బొడొఖిల్లాపాదొరొ సర్పంచ్ మాధవరావు కొండగిరి, మాజీ సర్పంచ్ ప్రసాద్ హుయిక తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాడీ బిల్డింగ్ పోటీలు



విజేతలతో అసోసియేషన్ సభ్యులు

బరంపురం: స్థానిక కళ్లికోట్ విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో గంజాం జిల్లా బాడీ బిల్డింగ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీలు ముగిశాయి. పోటీల్లో పూరీ జిల్లాకి చెందిన బాడీ బిల్డర్ అజిత్ కుమార్ జెన్నా విజేతగా నిలిచి మిస్టర్ ఒడిశా టైటిల్ అందుకున్నాడు. అదేవిధంగా నవరంగపూర్ జిల్లాకి చెందిన శాసంకా శేఖర్ సాహు ద్వితీయ స్థానంలో, గంజాం జిల్లాకి చెందిన జితేంద్ర కుమార్ పోలయి తృతీయ స్థానంలో నిలిచారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ బాడీ బిల్డింగ్ మేనేజర్ వేణుగోపాల రావు హాజరయ్యారు.

క్లుప్తంగా

ప్రథమ స్థానంలో నెల్లిమర్ల కబడ్డీ జట్టు



ప్రథమస్థానం సాధించిన నెల్లిమర్ల కబడ్డీ జట్టు

నెల్లిమర్ల: అనకాపల్లి జిల్లా నాగులపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల జట్టు ప్రథమస్థానం సాధించింది. ఈ సందర్భంగా విజేతలకు రూ.40వేలు నగదు బహుమతి అందజేశారు. జట్టు కెప్టెన్‌గా తాడ్డి లావణ్య వ్యవహరించారు. నెల్లిమర్ల జట్టు గతంలో అనేకసార్లు ఉత్తరాంధ్ర, రాష్ట్రస్థాయిల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు జట్టు శిక్షకుడు, సీకేఎం జూనియర్ కళాశాల రిటైర్డ్ పీడీ బొమ్మన రామారావు తెలిపారు. ఈ సందర్భంగా జట్టును నెల్లిమర్ల కబడ్డీ సంఘం అధ్యక్షుడు బి. సూర్యనారాయణ, నగర పంచాయతీ పెద్దలు అభినందించారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో పల్లవి ప్రతిభ



వెండి పతకం సాధించిన శనపతి పల్లవి

నెలిమర్ల రూరల్: ఈ నెల 19 నుంచి అరుణాచల్ ప్రదేశ్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్-2023 పోటీల్లో మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ శనపతి పల్లవి ప్రతిభ కనబరిచింది. ఆంధ్రా యూనివర్సిటీ తరఫున 64 కేజీల విభాగంలో మంగళవారం పోటీల్లో పాల్గొన్న పల్లవి స్నాచ్ 80 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 95 కిలోలు..మొత్తంగా 175 కిలోల బరువును ఎత్తి వెండి పతకం దక్కించుకుంది. ప్రతిభ కనబరిచిన వెయిట్ లిఫ్టర్ పల్లవికి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

సెంచూరియన్‌ను సందర్శించిన గిరిజన వర్సిటీ వీసీ



జైరో ప్లేన్ తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న గిరిజన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీని గిరిజన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టీవీ కట్టమణి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీలో అమలు చేస్తున్న కోర్సులు, నైపుణ్య విద్య గురించి సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రయోగశాలలు, పేపర్ లెస్ పరీక్షల విధానం, జైరో ప్లేన్ తయారీ, బ్యాటరీ ఆటోల తయారీ యూనిట్, తదితరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యను బోధించడానికి వీలుగా అన్ని పరికరాలు ఉన్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



లక్ష్మి మృతదేహం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జరజాపుపేట గ్రామంలో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై ఎస్సై రామగణేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జరజాపుపేటలోని ఎస్సీ కాలనీకి చెందిన కింతాడ లక్ష్మి(38) భర్తతో తగాదాల నేపథ్యంలో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మృతదేహానికి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం పూర్తిచేసి మంగళవారం బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామగణేష్ తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

భోగాపురం: ప్రతి విద్యార్థి తమ ఓటు హక్కును వియోగించుకోవాలని తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎన్నికల విధి విధానాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తు తరాలను మార్చగలిగే ఓటును 18 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలన్నారు. ఓటు వేయడం మన బాధ్యత కర్తవ్యంగా భావించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి సత్యనారాయణమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో..

వినికిడి సమస్యకు విముక్తి

- చెవిటి, మూగతో బాధపడుతున్న బాలుడికి శస్త్ర చికిత్స
- మరో ఆరునెలల్లో మాట్లాడే అవకాశం

రాజాం: చెవుడు, మూగ సమస్యతో బాధ పడుతున్న ఓ చిన్నారిని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఆదుకుని కొత్త బంగారు లోకాన్ని పరిచయం చేస్తోంది. కొత్తగా ఈ పథకంలో చికిత్స పరిమితి రూ.25 లక్షలకు పెంచడంతో చాలా మంది నిరుపేదలు లబ్ధిపొందుతున్నారు. అత్యవసర ప్రాణాపాయ సమయాల్లోనే కాకుండా తమకు పుట్టిన చిన్నారులకు వచ్చే దీర్ఘకాలిక వ్యాధులను సైతం నయం చేయించుకోగలుగుతున్నారు. ఈ పథకం ద్వారా చాలా మంది చిన్నారులు కొత్త ప్రపంచాన్ని చూస్తున్నారు. ఈ కోవలోకే వస్తాడు రేగిడి మండలం అంబఖండి గ్రామానికి చెందిన పుర్లి రాజ్యలక్ష్మి, ఏసుబాబుల కుమారుడు మూడున్నరేళ్ల నిఖిల్. పుట్టుకతోనే చెవుడు, మూగ సమస్యతో నిఖిల్ బాధపడుతున్న విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు తమ చిన్నారిని ఏడాది క్రితం రాజాంలోని వీర్ స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్‌కు తీసుకొచ్చారు. అక్కడి వైద్యుడు డాక్టర్ కర్నాయిన శ్రీనివాస్ నాయుడు అప్పటి ఆరోగ్యశ్రీ నిబంధనల ప్రకారం ఒక చెవికి ఆపరేషన్ నిమిత్తం ఆరోగ్యశ్రీకి దరఖాస్తు చేయించారు.

ప్రస్తుతం రెండు చెవులకు..

ఒక చెవికి ఆపరేషన్ నిమిత్తం చిన్నారికి ప్రాథమిక చికిత్స ప్రారంభించి సిద్ధం చేశారు. అంతలోనే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ఆపరేషన్ వ్యయం పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతో చిన్నారి రెండో చెవికి కూడా ఆపరేషన్ మంజూరైంది. దీంతో రెండు చెవులకు కార్లియర్ ఎంప్లాంట్ ఆపరేషన్‌ను వైద్యులు చేసి మెషీన్లను అమర్చారు. ఈ రెండు ఆపరేషన్లకు రూ.18 లక్షలు వరకూ వ్యయాన్ని ప్రభుత్వమే భరించింది. రైతువారీ కుటుంబానికి చెందిన రాజ్యలక్ష్మి, ఏసుబాబులు ప్రభుత్వం తమ కుమారుడికి వినికిడి, మాట వచ్చేందుకు ఖర్చుచేసిన మొత్తాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. అరుదైన ఈ చికిత్స ద్వారా తమ కుమారుడు కొత్త ప్రపంచాన్ని తెలుసుకోబోతున్నాడని తెలిసి ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇంతవరకూ తమకు ఒక్క పైసా కూడా ఖర్చుకాలేదని, ప్రభుత్వమే మొత్తం భరించిందని నిఖిల్ తల్లిదండ్రులు సాక్షికి తెలిపారు.



ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్న నిఖిల్ (ఇన్‌సెట్లో) ఆపరేషన్ ద్వారా మిషన్లు అమర్చిన చెవి ఎగువభాగం

మరో ఆరునెలల్లో సంభాషణ



చిన్నారి నిఖిల్‌కు ఏడాది క్రితం చికిత్స ప్రారంభించాం. ఇటీవలే రెండు చెవులకు ఆపరేషన్ చేయడంతో పాటు మెషీన్లు ఏర్పాటుచేశాం. ఇవి జీవితాంతం పనిచేస్తాయి. మరో 21 రోజుల నుంచి నిఖిల్‌కు అందరి మాట వినపడుతుంది. ఆరు నెలల వ్యవధిలో మాటలు నేర్చుకుని సంభాషించగలడు. ఇది చాలా అరుదైన చికిత్స. 5 సంవత్సరాల్లోపు చిన్నారులకు ఈ ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తుంది. గతంలో ఈ పథకం ద్వారా ఒక చెవికి మాత్రమే ఆపరేషన్ నిమిత్తం అనుమతి ఉండేది. ఇప్పుడు రెండు చెవులకు ఆపరేషన్ నిమిత్తం ప్రభుత్వం నిధులు ఇస్తోంది. రాజాం నియోజకవర్గ పరిధిలో ఇటీవల ఈ ఆపరేషన్ నిమిత్తం 22 మంది వరకూ చిన్నారులు అర్హత సాధించారు. వారందరికీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కొత్త ప్రపంచాన్ని ఇస్తున్నారు.

కర్నాయిన శ్రీనివాస్ నాయుడు, ఆడియోలజిస్ట్ అండ్ స్పీచ్ థెరఫీ వీర్ స్పీచ్ అండ్ హియరింగ్ ఆస్పత్రి, రాజాం.

శతశాతం పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలి

- డీపీఓ శ్రీధర్‌రాజా

చీపురుపల్లి: మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యం శతశాతం మెరుగ్గా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రాజా చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశాల మేరకు చీపురుపల్లి మేజర్ పంచాయతీలో జి.అగ్రహారం, రెడ్డిపేట, వంగపల్లిపేట, కొత్తగవిడివీధి, కొత్తకుమ్మరికాలనీ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేజర్ పంచాయతీలోని 20 వార్డుల్లో పారిశుద్ధ్య పనులు పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశాల మేరకు చీపురుపల్లి మేజర్ పంచాయతీలో ఫిబ్రవరి 11 నుంచి 22 వరకు పారిశుద్ధ్య నిర్వహణ పనుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే మేజర్ పంచాయతీలో ఉన్న పారిశుద్ధ్య కార్మికులతో పాటు ప్రత్యేక డ్రైవ్ కోసం అదనంగా మరికొంత మంది సేవకులను తీసుకుని, యంత్రాలు ఏర్పాటు చేసి పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతున్నట్లు చెప్పారు. మరో రెండు రోజుల్లో మేజర్ పంచాయతీలో పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ అన్నపూర్ణదేవి, మేజర్ పంచాయతీ అధికారి ఝాన్సీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న డీపీఓ శ్రీధర్‌రాజా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో బాలాజీ లాడ్జి ఎదురుగా రోడ్డు మీద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసు కలిగి ఉన్న గుర్తు తెలియిన వ్యక్తి గురించి విచారణ చేయగా ఎటువంటి వివరాలూ తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, కుటుంబసభ్యులు, బంధువులు ఎవరైనా ఉంటే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ బి.వెంకటరావు కోరారు.

ఎడ్ల బండిని లారీ ఢీ కొని ఎద్దు మృతి

కొమరాడ: నాగావళి నది నుంచి ఇసుక తీసుకొచ్చేందుకు వెళ్తున్న ఎడ్ల బండిని కొమరాడ మండలం విక్రంపురం సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొనడంతో ఎద్దు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం కృష్ణపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి సింహాచలం మంగళవారం ఉదయం ఎడ్ల బండిని తోలుకు వెళ్తుండగా అదే సమయంలో రాయగడ వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందగా ఎడ్లబండిని తోలుతున్న సింహాచలానికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు.



లారీ ఢీ కొట్టడంతో మృతి చెందిన ఎద్దు

ఆధునిక శాస్త్ర సాంకేతికత మానవాళి నేత్రాలపై ప్రభావం

- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ రమణి

విజయనగరం ఫోర్ట్: ఆధునిక శాస్త్ర సాంకేతికత పెరుగుతూ దీని ప్రభావం మానవాళి నేత్రాలపై ఎంతో దుష్ప్రభావం చూపిస్తుందని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ రమణి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కంటి విభాగానికి ప్రభుత్వం సరఫరా చేసిన ఆటోరిఫ్రాక్టోమీటర్, ఇన్‌డైరెక్ట్ ఆప్తాల్మాస్కోప్, సైన్ అప్టోపోర్ అప్లినేషన్ టోనో మీటర్, విజువల్ ఫీల్డ్స్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వజన ఆస్పత్రి కంటి విభాగంలో మెరుగైన సేవలు అందిస్తున్నారని చెప్పారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యున్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. నేత్రదానంపై కూడా ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో కంటి విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ బి.శివప్రసాద్, ఆర్‌ఎంఓ డాక్టర్ సురేష్‌బాబు, ఎస్పీఎం విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, డాక్టర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



నేత్ర పరికరాల గదిని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



వీధి విక్రయదారులకు అవగాహన కల్పిస్తున్న నగర కమిషనర్

విజయనగరం: ప్రధాన రహదారుల్లో పారిశుద్ధ్యానికి విఘాతం కలగకుండా వీధి విక్రయదారులు ఎవరు ప్రాంతాలను వారే పరిశుభ్రపరుచుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ యం.మల్లయ్యనాయుడు సూచించారు. మంగళవారం ఉదయం నగరంలోని పలు ప్రధాన రహదారులను ఆయన పరిశీలించారు. పారిశుద్ధ్య ప్రక్రియ ఏ విధంగా ఉందో గమనించారు. కొన్నిచోట్ల వీధి విక్రయదారులు చెత్తా చెదారాలను వేయడాన్ని గమనించి పరిస్థితిలో మార్పు తీసుకురావాలని అక్కడున్న పారిశుద్ధ్య పర్యవేక్షకులకు, సిబ్బందికి ఆదేశించారు. అలాగే వీధి విక్రయదారులకు అవగాహన కల్పించి విక్రయ ప్రాంతాలలో పరిశుభ్రత వాతావరణం నెలకొనే విధంగా స్వీయ పరిశుభ్రత విధానాన్ని పాటించవలసిందిగా సూచించారు. అనంతరం పాలాస్పత్రిలో ఉన్న మస్టర్ పాయింట్‌కి వెళ్లి సిబ్బంది రిజిస్టర్లను పరిశీలించారు. అందరి సహకారంతో నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెప్పారు.

కోడి పందాలాడుతున్న ముగ్గురి అరెస్టు

బొండపల్లి: మండలంలోని జె.గుమడాం గ్రామం శివారులో మంగళవారం సాయంత్రం కోడి పందాలు ఆడుతుండగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కోడి పందాలు ఆడుతున్న సమాచారం మేరకు పోలీసులు అక్కడి వెళ్లి దాడి చేసి ముగ్గురు వ్యక్తులతో పాటు, ఏడు కోడి పుంజులు, రూ.11,350 రుపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేశామని ఎస్సై లక్ష్మణరావు చెప్పారు.

148 మద్యం సీసాల పట్టివేత



మద్యంసీసాలు పట్టుకున్న ఎస్‌ఈబీ ఇంటెలిజెన్స్ వింగ్

విజయనగరం క్రైమ్: గంట్యాడ మండలంలోని పెదవేమలి గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 148 మద్యం సీసాలను ఎస్‌ఈబీ ఇంటెలిజెన్స్ వింగ్ సీఐ విజయకుమార్, హెచ్‌సీ బాషా, కానిస్టేబుల్స్ రవి, సత్యనారాయణలు పట్టుకున్నారు. అనంతరం మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వాటిని తరలిస్తున్న నిందితుడు గేదెల సన్యాసినాయుడిని అదుపులోకి తీసుకుని ఎస్‌ఈబీ స్టేషన్‌లో అప్పజెంచారు.

పాలకొండలో 12 మద్యం బాటిల్స్..

పాలకొండ రూరల్: మండలంలోని బద్దుమాసింగి గ్రామానికి చెందిన బుగత మణికంఠ 12 మద్యం బాటిల్స్‌ను అక్రమంగా తరలిస్తూ పాలకొండ ప్రధాన మార్కెట్‌లో ఎస్సై ఎస్.ప్రశాంత్ కుమార్‌కు మంగళవారం పట్టుబడ్డాడు. మద్యం సీసాలను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

భోగాపురం: మండలంలోని తూడెం గ్రామంలో బెల్టు షాపు ద్వారా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ వనుము లక్ష్మిని ఎస్సై సూర్యకుమారి మంగళవారం అరెస్టు చేసి కేసు నమోదు చేశారని సీఐ రవికుమార్ తెలిపారు. పట్టుబడిన ఆమె దగ్గర 19 మద్యం సీసాలను ఎస్సై సూర్యకుమారి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వేంకటేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు

డెంకాడ: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని డెంకాడ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. విష్ణు సహస్ర నామస్తోత్ర పారాయణ, శ్రీ వాసుదేవస్వామికి అష్టోత్తర నామార్చాన జరిగింది. భక్తులు పాల్గొని పూజలు చేశారు.

భీష్మ ఏకాదశి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ ఉమా రామలింగేశ్వర దేవాలయంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పండితులు వాడ్రేవు నాగరాజు శర్మ ఆధ్వర్యంలో భక్తులు గోత్రనామాలతో స్వామివారికి పంచామృతాలుతో అభిషేకం చేశారు. తులసీ దళాలతో వివిధ రకాల పుష్పాలతో అర్చన చేసి ధూప దీప నైవేద్యములు నీరాజన మంత్ర పుష్పములు స్వామి వారికి విశేషంగా సమర్పించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు మహోత్సవం

- చాదర్ సమర్పించిన దర్బార్ షరీఫ్ ఖలీల్‌బాబు
- వేలాది మంది భక్తులకు అన్నసమారాధన

విజయనగరం టౌన్: హజరత్ ఖాదర్‌వలీబాబా ఉరుసు మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బాబాను దర్శించి తరించారు. తొలిరోజు పవిత్రఖురాన్ షరీఫ్ పఠనంతో ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం చీమలపాడు సూఫీ పీఠాధిపతి మొహమ్మద్ ఖ్వాజా మోహియుద్దీన్ షా తాజ్ ఖాదరి, విజయనగరం దర్గా, దర్బార్ షరీఫ్ ముతవల్లి డాక్టర్ మొహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ నేతృత్వంలో అశేష భక్తులతో కలిసి ఫకీర్ మేళా, డప్పు వాయిద్యాలతో బాబా దర్గాకు ఊరేగింపుగా వెళ్లి బాబాది వ్యసమాధికి సుగంధ పరిమళ ద్రవ్యాలను, పూలు, గజమాలలతో చాదర్ సమర్పించారు. అనంతరం సూఫీ పీఠాధిపతి సజ్జాద నషీన్ మొహమ్మద్ ఖాజా మోహియుద్దీన్ షా ఖాదరి భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ఉరుసులో ప్రధానఘట్టం బుధవారం జరుగుతుందని చెప్పారు. బాబా జీవించి ఉన్న కాలంలో చిత్రీకరించిన ఆయన చిత్రపటాన్ని చాదర్, పూలు, సుగంధ ద్రవ్యాలతో ఒక ప్రత్యేక వాహనంపై ఉంచి నషాన్, చాదర్, సందర్ షరీఫ్‌లతో, ఫకీర్ మేళా ఖవ్వాలీలతో దర్బార్ షరీఫ్ నుంచి నగర వీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. మూడురోజుల పాటు ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులకు లంగర్ ఖానాలో భారీ ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. 172: బాబాకు చాదర్ సమర్పిస్తున్న దర్బార్ నిర్వాహకుడు డాక్టర్ ఖలీల్‌బాబు



భక్తులకు అన్నసమారాధన చేస్తున్న దృశ్యం

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న చదురుగుడి పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం భక్తులకు పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ.భాస్కరరావు ఆధ్వర్యంలో మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి, రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో కొలువైన అమ్మవారికి వేకువజామునుంచి ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ నేతృత్వంలో పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమానుపూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో వేదపండితులు శాస్త్రోక్తంగా అమ్మవారికి చండీయాగం నిర్వహించారు. విశాఖ పోర్ట్ ట్రస్ట్ కార్యదర్శి మంజుభార్గవి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పోర్ట్ ట్రస్ట్ కార్యదర్శి మంజుభార్గవి, తదితరులు

ఘనంగా జొన్నాడ పైడితల్లమ్మ జాతర

- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బడ్డుకొండ



జొన్నాడ పైడితల్లి అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు

డెంకాడ: కోర్కెలు తీర్చే కల్పవల్లి జొన్నాడ పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. డెంకాడ మండలంతో పాటు విజయనగరం, విశాఖ జిల్లా పద్మనాభం మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మను దర్శించుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు విజయనగరం - విశాఖ జాతీయ రహదారికి ఆనుకుని ఆలయం ఉండటం వలన ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

జొన్నాడ పైడితల్లి అమ్మవారిని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు దర్శించుకుని, పూజలు చేశారు. వారి వెంట జొన్నాడ సర్పంచ్ దంపతులు కోరాడ రమణి, కోటినాయుడు, ఎంపీటీసీ త్రిపుగిరి దేవి దంపతులు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

మొక్కజొన్న సాగుపై రైతులు అప్రమత్తం

పూసపాటిరేగ : మొక్కజొన్న సాగును కత్తెర పురుగు ఆశిస్తున్నందున రైతులు అప్రమత్తంగా వుండాలని వ్యవసాయ శాఖ జేడీ వి.తారకరామారావు అన్నారు. మండలంలోని కుమిలి గ్రామంలో మొక్కజొన్న సాగును మంగళవారం పరిశీలించారు. సాగుకు కత్తెర పురుగు ఆశించడంతో పరిశీలన చేసి సస్య రక్షణపై రైతులకు అవగాహన చేశారు. అనంతరం కుమిలి గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రైతులకు అవగాహన చేశారు. గ్రామంలో పీఎం కిసాన్, పంట నమోదు కార్యక్రమంపై రైతులకు తెలియజేశారు. ఈ నెల 21వ తేదీలోగా ఈకేవైసీ పెండింగులో వున్న రైతులు చేసుకోవాలి అన్నారు. పంట నమోదు ఈకేవైసీని ఈ నెల 23వ తేదీలోగా చేసుకోవాలి అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎ.డి నాగభూషణరావు, మండల వ్యవసాయ అధికారి కె.నీలిమ, వ్యవసాయ శాఖ సహాయకులు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: నానో యూరియా వాటడం వలన రైతులకు పంట సాగు ఖర్చు తగ్గుతుందని, అన్ని విధాలుగా మేలుగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి టీవీ రామారావు అన్నారు. మండలంలోని చొల్లంగిపేట గ్రామంలో జీరోటిల్లేజ్ విధానంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి రామారావు మాట్లాడుతూ నానో యూరియా వాడటం వలన ఎరువుల కొనుగోలు ఖర్చుతో పాటు రవాణా ఖర్చు తగ్గుతుందని వివరించారు. మామూలు యూరియా వాడేటప్పుడు అది 50శాతం మాత్రమే మొక్కకు ఉపయోగపడుతుందన్నారు. అదే నానో యూరియా వినియోగం వలన వందశాతం మొక్కకు అందుతుందన్నారు. ఏఓ పూడి నిర్మల, ఏఈఓ ఎం.ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.



మొక్కజొన్న సాగులో సస్యరక్షణపై రైతులతో మాట్లాడుతున్న జేడీ

విజేతలకు బహుమతులు అందజేత



బహుమతులు సాధించిన విజేతలు

విజయనగరం పూల్‌బాగ్: ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన ప్రజ్ఞావికాసం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి స్థానిక జెడ్పీ కార్యాలయంలో మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వన్ టౌన్ సీఐ వెంకటరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు, జీవీకె జిల్లా కన్వీనర్ శ్రీను హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని కోరారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి అభినందనలు తెలియజేశారు. దీనిలో భాగంగా జిల్లా ప్రథమ బహుమతి వై.కృష్ణవర్ధన్ (రవీంద్ర భారతి స్కూల్, ఎస్.కోట)కి మెమొంటోతో పాటు రూ.5వేలు నగదు బహుమతి, జిల్లా ద్వితీయ బహుమతి ఎం.ఆశా దీపిక (నారాయణ ఒలంపియాడ్, విజయనగరం)కు మెమొంటోతో పాటు రూ.3వేలు నగదు బహుమతి, జిల్లా తృతీయ బహుమతిగా పి.సౌభాగ్య (గవర్నమెంట్ బాలికల హైస్కూల్, నెలిమర్ల)కు మెమొంటోతో పాటు రూ.2వేలు నగదు బహుమతిని అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సిహెచ్.వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శులు పి.రమేష్, ఎస్.సోమేష్, కె.రమేష్, జిల్లా కమిటీ నాయకులు రాజు, వంశీ, డేవిడ్, మణి, సంధ్య, అంజలి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.